వింజామరంగారికి నలత క్రమక్రమంగా ముదిరింది. మంచాన్ని పట్టేడు భార్య ఎంతో విచారించింది వైద్యుడు చికిత్స చేస్తున్నాడు. కాని గుణమియ్యలేదు.

ఆయనభార్య "ఈ రోగమంతా మీకు కవిత్వమే తెచ్చిపెట్టింది. ముసలితనంలో మీకెందుకు పుట్టిందో ఈ పోయి కాలం-పోయిగా కాలుమీదకాలు వేసుకు కూర్చుని రామాకృష్ణ అనుకోక ఎందుకు వచ్చినపని ఇది! ఇప్పటికేనా కాస్తబుద్ధి తెచ్చుకోండి!" అంది.

ఒకవేళ ఆమె చెప్పినమాటే నిజమేమో అని "అయితే ఏమ్మని చెయ్యమన్నావే?" అని అడిగేడు.

"ఏమిటి చెయ్యమన్నా నేమిటి! తిరుపతి వెంకటేశ్వరుడికి మొక్కుకోండి. ఈ రోగం నిమ్మళిస్తే నీ కొండకి వచ్చి దర్శనం చేసుకొంటానని" అంది.

ఏలాగో ఒకలాగు బతికుంటే చాలునని వింజామరంగారు కవిత్వాన్ని తిరుపతి వెంకటేశ్వరుడికి ముడుపుకట్టేడు.

---

స్కెచ్

# పెద్దవాళ్ళ పరువు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

బట్టలు వేసుకుని ఆఫీసుకి వెళ్లబోతూ, డ్రాయర్ లోంచి పదిరూపాయిలనోటు తీసుకోడం మాట జ్ఞాపకంవచ్చి ప్రకాశరావు ఒకసారి వెనుదిరిగ్గాడు, తొందరగా తాళంతీసి వెదికాడు- అతనెక్కడ దాన్ని పెట్టాననుకున్నాడో అదక్కడలేదు. పుస్తకాలన్నీ తీసి వెదికాడు. లేదు. పర్సు చూసుకున్నాడు. ఒక ఐదు రూపాయిల నోటుమాత్రం ఉంది. పది రూపాయిల నోటు ఏమైంది?

వెతకడంమానేసి నిటారుగానిలబడి ఎక్కడ దాన్ని పెట్టాడోఆలోచించుకున్నాడు తాపీగా. నిన్న మధ్యాహ్నం అక్కడ ఉండి రానుకుంటూంటే ఇంటద్దె ఇచ్చిరమ్మని భార్యతో చెప్పాడు. పదిరూపాయిల నోటు ఇచ్చాడు. ఇంటివాళ్లెక్కడికో వెళ్ళారని మళ్ళా ఆమె ఆ నోటు తెచ్చి ఇస్తే డ్రాయర్లో నీలం పుస్తకంలో దాన్ని పెట్టాడు. ముమ్మాటికీ అది అక్కడ ఉండితీరాలి!

మళ్ళా వెదికాడు, కనబడలేదు. అతనికి చిరాకు వేసింది. ఏమైనట్లు?

"పార్వతీ!" అని గట్టిగా పిల్చాడు. ఆఫీసుకి టైమ్ అవుతోంది.

ఆమె వచ్చింది. "పదిరూపాయిలు నువ్వుగాని తీశావా?" అన్నాడు.

"లేదే! అందులో లేదూ?" అంది ఆశ్చర్యంగా పార్వతి.

"లేదు... ఏమైనట్లు?" ప్రశ్నార్థకముఖం.

"ఏమైందంటారు? జాగ్రత్తగా చూశారా?"

"కావలసినంత జాగ్రత్త. నువ్వో సారి చూడు. ఇవాళ ఇన్స్యూరెన్స్ ప్రీమియం కడదామని అనుకున్నా. నువ్వో వెదుకు"

ప్రకాశరావు చిరాకుగా ఆఫీసుకు వెళ్లిపోయాడు, డబ్బంటే అతను చాలా చులాగ్గా చూడడు. పదిరూపాయిలు! ఏమైనాయో!

సాయంత్రం ఇంటికి వెళ్ళగానే మళ్ళా ఆ నోటు ప్రస్తావన తెస్తూ, "దొరికిందా పార్వతీ?" అన్నాడు.

"లేదండీ!"

"వెదికావా బాగా?"

"జాగ్రత్తగా వెదికాను"

"అయితే ఏమైందంటావ్? ముగ్గురిలోనూ ఎవళ్ళో ఒకళ్లు తియ్యాలిగా? నేను తియ్యలేదు- నువ్వు తియ్యలేదు. ఇంక సత్యం తీసి ఉండాలి; దొంగ లెత్తుకెళ్ళి ఉండాలి"

"ఆశ్చర్యంగా నేఉందండీ! నిన్న మధ్యాహ్నం పెట్టిన నోటు ఈ వేళకెలా మాయంఅయిందో! సత్యం ఎందుకుతీస్తాడు? ఎప్పుడైనా అలా తీశాడుగనక నా?"

"ఏమో! ఎవరుచూడొచ్చారు? వాణ్ని అడుగుతా — దయ్యాలేం లేవుగా ఇంట్లో? దొంగ అయితే ఎక్కడో పుస్తకంలో ఉంచిన ఈనోటు కోసం ప్రత్యేకంగా రాడు!"

సత్యం స్కూలునించి రాణే వచ్చాడు— వస్తూనే ఈ గొడవ గ్రహించిన వాడిలాగ పెరట్లోకి వెళ్ళిపోయాడు.

"జారుకొన్నాడేం?"

"ఏమో! ముఖం కడుక్కుంటాడు కాబోలు."

"కాబోలు! వాడి ముఖంచూస్తే తెలియడంలా?"

"బాగుందండీ ఇంక! వాణ్ని చంపేస్తారు కాబోలు!"

"నువ్వూరుకో! డబ్బుకోసం ఏమీ కాదు. వాడికి దొంగతనం అబ్బితే అందరమూ సుఖపడ్డట్లే"

ముఖంకడుక్కుని కాఫీతాగి సత్యం ఆడుకోడానికి పోతున్నాడు.

"ఒరేయ్!"

సత్యం భయపడుతూ చూశాడు.

"పదిరూపాయలూ ఏంచేశావ్?"

"ఏ పదిరూపాయలు నాన్నా?"

"నా డ్రాయర్‌లోంచి తీసినవి"

"నేనేం తియ్యలేదు నాన్నా!"

"ఒరేయ్ — అబద్ధాలేమీ ఆడకు. నువ్వు తీశావని బుజువైపోయింది. నిజంఒప్పుకున్నావా సరి- లేకపోతే నాకు చాలాకోపంవచ్చేస్తుంది."

"నేను తియ్యలేదు నాన్నా!"

"మళ్ళా అదేమాట - చెత్తమాట! గొడవ చెయ్యక ఎంత మిగిలిందో పట్టుకురా"

సత్యంకళ్లలో నీళ్ళుతిరిగాయి.

"నాకేం తెలీదు" అన్నాడు.

"చివరిసారి చెప్తున్నాను... ఇస్తావా లేదా?" ఉగ్రుడైపోయాడు ప్రకాశరావు. రెండుమూళ్ళు ఆరు అన్నంత స్పష్టంగా బుజువైన నేరాన్ని వీడు కాదంటాడెందుకని?

సత్యం మాట్లాడలేదు తలవంచుకున్నాడు.




తమిళనాడు, కేరళ, మైసూరు,

ఆంధ్ర దేశము (పశ్చిమ గోదావరి జిల్లావరకు) లకు

సోల్ ఏజెంట్లు:

RM. S. & CO. LTD.,

16, Broadway, MADRAS-1.

విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాలకు ఏజెంట్లు:

మెక్‌డొవెల్ అండ్ కో., లిమిటెడ్, విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను.

"అదీ సంగతి! ఖర్చైపోయింది కదూ?" ప్రకాశరావు అన్నాడు.

"ఏమీ మిగల్లేదు!"

ఛెళ్ళునసత్యం చెంప మీద ప్రకాశరావు చెయ్యి పడింది. వాడి కళ్ళమ్మట మరి కొంచెం నీళ్లు వచ్చాయి—కాని వాడు ఏడవలేదు.

"దొంగతనం ఎందుకు చేశావ్? నన్నడగక పోయావ్? నీకెప్పు డివ్వలేదు కనక?"

"నేను దొంగతనం చెయ్యలేదు నాన్నా!" సత్యం గాద్గదికంగా అన్నాడు.

"ఇంకా వాదనే?—నిజం చెప్పకపోతే ఇవాళ వళ్ళు పగులుతుంది... చెప్పు."

"సామ్యం చెప్పినట్లుందింక—ఏదో జరిగింది. కొడితే ఖర్చుఅయినది మళ్ళా వస్తుందా? ఇంక జాగ్రత్తగా ఉందాము. పోనియ్యండి" అంది కొంచెం కోపం తగ్గించడానికి పార్వతి.

ప్రకాశరావు కదేమీ వినపడలేదు. తన కొడుకు తన ఇంట్లో దొంగతనం చెయ్యడం అతనికి తల తీసినట్లు ఉంది. పైగా నిజం ఒప్పుకోడు.

మరి కొన్ని దెబ్బలు కొట్టాడు. సత్యం కిక్కురుమనలేదు, కంటినీరు వాడి అధీనం కాదు కనక స్వేచ్ఛగా కారింది...పార్వతి నోరెత్త లేదు.

రెండు రోజులు సత్యం హీనంగా చూడబడ్డాడు. "అలాంటి గుణాలు" పార్వతికూడా సహించే మనిషి కాదు.

కాని సత్యం మామూలుగానే ఉన్నాడు. బడికి వెళ్తున్నాడు వస్తున్నాడు. ఎవ్వరితోనూ మాట్లాడ్డంలేదు. క్రమంగా ఈ విషయం పార్వతికీ ప్రకాశరావుకీ కూడా చాలా బాధాకరంగానే కనిపించసాగింది.

మూడోరోజున చిన్న గమ్మత్తు జరిగింది. హెడ్‌క్లర్కు ఆనాటి కేంపునించి వచ్చి పుటప్ చేసిన ఫైల్స్ అన్నీ చూస్తున్నాడు. అందులో ఓ ఫైలులోంచి ఓ పదిరూపాయిల కాగితం క్రిందని పడింది.

ఆ ఫైలు ప్రకాశరావుది. అందుచేత అతన్ని పిలిచి అది ఇచ్చేద్దామని పిలిచాడు.

"అసలీనోటెందులోకి ఎలాగ వచ్చింది?" అన్నాడు హెడ్‌క్లర్కు.

ప్రకాశరావు నిజం చెప్పలేకపోయాడు. "ఇంట్లో పొరపాటున పెట్టాను. వచ్చేటప్పుడు తియ్యడం మరిచిపోయాను" అన్నాడు.

ఆఫీసునించి బయట పడేసరికి అతన్ని చాలా బరువైన సిగ్గు ఆవరించింది. ఐతే తానా నోటు ఫైల్లో పెట్టాడు—దానికోసం కొడుకుని చితగ్గొట్టాడు!

గుమ్మం ఎక్కేసరికి పార్వతి ఎందుకో సత్యాన్ని దెబ్బలాడుతోంది. కసిరాడు ప్రకాశరావు "ఎందుకలా చేస్తావు?" అని. సత్యంవేపు తిరిగి, ప్రేమతో "నీకేం కావాలి?" అని అడుగుదామనుకున్నాడు. కాని అతననుకోకుండానే అతని గొంతుకలోకి కాఠిన్యం వచ్చింది. సిగ్గుపడ్డాడు... "నాకేంవద్దు" అన్నాడు సత్యం.

ఆ సాయంత్రం అంతా ప్రకాశరావు చాలా పరధ్యానంగా ఉన్నాడు. ఒకటి రెండుసార్లు పార్వతి అడిగింది-నిజం చెప్దామనుకున్నాడు-కాని, పిరికితనం నిజాన్ని గొంతుక దాటనివ్వ లేదు.

ఆ రాత్రి ఎవ్వరూ చూడకుండా ప్రకాశరావు వీధిలోకి నడిచాడు... పది రూపాయల నోటు జేబులో వేసుకుని ఒక షాపుదగ్గర పది రూపాయి నాణేలు తీసుకెళ్ళాడు. తనకి కనిపించిన ప్రతీ ముష్టివాడికీ ఒక్కొక్క రూపాయి ఇచ్చాడు.

ఇంక ఒక్క రూపాయి మిగిలింది. మరెవరూ కనిపించలేదు. ఇంటికి తిరిగి వచ్చాడు. అంతా నిద్దరోతున్నారు.

నెమ్మదిగా సత్యం మంచందగ్గరికి వెళ్ళాడు. అతని కళ్లనిండా నీరొచ్చింది... చేతులు జోడించి క్షమాపణ చెప్దామనుకున్నాడు - మనస్సులోనే క్షమాపణ చెప్పాడు.

మర్నాడుదయం సత్యం బడికిపోతుంటే, "ఈ రూపాయి పట్టుకుపో-ఎప్పుడూ దొంగతనం చెయ్యకేం? తప్పుకదూ?" అన్నాడు ప్రకాశరావు.

సత్యం రూపాయి పుచ్చుకోలేదు. బడికి వెళ్ళిపోయాడు. కాని, తొలినాడు తాను తీసి మర్నాడు ఫైల్లో పెట్టేసిన పదిరూపాయల నోటు ఏమైందో వాడి చిన్నబుర్రకి అంతు చిక్కలేదు.